ప్రజాశక్తి
గురువారం ఏప్రిల్ 18 2024 8 పేజీలు
శ్రీకాకుళం



పార్టీ కోసం పనిచేస్తాం

- తగిన ప్రాధాన్యం కల్పించాలి
- అచ్చెన్న, ఎంపీ, కూన హామీ ఇవ్వాలి
- సమావేశంలో టిడిపి నగర నాయకుల తీర్మానం

(...2లో)

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఈనెల 25 వరకు స్వీకరణ
- సిద్ధమవుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన ఘట్టానికి తెరలేచింది. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. సెలవు రోజులు మినహా ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు తీసుకుంటారు. అనంతరం 26వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు.

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నేటి నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లో నామినేషన్లు (మిగతా...2లో)



గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, ప్రాపర్టీ, ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ తదితర అంశాలపై పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, నిందితులపై ఛార్జిషీట్ దాఖలు కోర్టులో చేయాలన్నారు. ఎస్‌సి, (మిగతా...2లో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఎ.ఎస్ పేటలో ట్యాంకర్ల వద్ద మంచినీటి కోసం మహిళ పాట్లు

గొంతెండుతోంది

- 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీరు
- మరమ్మతులకు గురైన పలు పథకాలు
- చేతిపంపులదీ అదే పరిస్థితి
- మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల నీరే దిక్కు

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణ రోజుల్లోనే పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో వేసవి ప్రారంభం కావడంతో నీటి సమస్యలు మొదలయ్యాయి. జిల్లాలో సగానికి పైగా గ్రామాల్లో పాక్షికంగానే తాగునీరు అందుతోంది. సమగ్ర, రక్షిత, సింగిల్ విలేజ్ స్కీమ్‌లు చాలాచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రతి ఏగాదీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేవారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి కనెక్షన్లు ఇస్తున్నామనే పేరుతో ప్రభుత్వం రెండేళ్లుగా సరఫరా నిలిపివేసింది. పాత పథకాలను ఆపేయడం, కొత్తవి ప్రారంభం కాకపోవడంతో గ్రామాల్లో మంచినీటికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మున్సిపాల్టీల్లోనూ మహిళలకు నీటి వెతలు తప్పడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 4,037 గ్రామాలు ఉండగా, కేవలం 1518 గ్రామాలకే తాగునీరందుతోంది. 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా జరుగుతోంది. జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాలు ఉండగా, ఏ ఒక్క పథకమూ సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లాలో ఉన్న 918 రక్షిత మంచి నీటి పథకాల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో (మిగతా...2లో)



ప్రచారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, రవికుమార్

రాష్ట్రాన్ని ప్రజలే రక్షించుకోవాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

దివాళా తీసిన రాష్ట్రాన్ని ప్రజలే రక్షించుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొర్లకోటలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేతకాని పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి పునర్నిర్మాణం కోసం (మిగతా...2లో)

పొరుగు నేతలకు 'పట్టం'

- అక్కున చేర్చుకున్న జిల్లా ప్రజలు
- వి.వి గిరి నుంచి రెడ్డి శాంతి వరకు...
- నియోజకవర్గం మారినా నేతలకు అవకాశం

స్థానికేతర నినాదం.. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో తెర పైకి వస్తూనే ఉంది. జిల్లా, నియోజకవర్గం మారి వచ్చారని ప్రత్యర్థులు ప్రచారం చేసినా, ప్రజలు పట్టించుకోరని చరిత్ర చెబుతోంది. ప్రాంతంపై అవగాహన, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకునే వ్యక్తికే ప్రజలు పట్టం కడుతూ వస్తున్నారు. తొలినాళ్లలో వి.వి గిరి నుంచి నేటి రెడ్డి శాంతి వరకూ నేతలను ఆదరించి శాసనసభకు, పార్లమెంట్‌కు పంపించారు జిల్లావాసులు.

(మధ్యపేజీల్లో)



సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

ఒక్క అవకాశం ఇవ్వండి

- ఎంపీ రామ్మోహన్ నాయుడు ఫెయిల్
- రేపు నామినేషన్‌కు తరలి రావాలి
- వైసిపి ఎంపీ అభ్యర్థి తిలక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సామాన్య కుటుంబం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఒక్క అవకాశం ఇవ్వాలని వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ప్రజలను కోరారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాటు ఎంపీగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లా అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. రెండుసార్లు ప్రజలు ఆయనకు అవకాశం ఇచ్చినా చేసింది శూన్యమని, ఎంపీగా ఆయన ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఎంపీ నిధులను సకాలంలో ఖర్చు చేయలేక వెనక్కి (మిగతా...2లో)

ఉదయం ఎండ... సాయంత్రం వాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడు ప్రతాపం చూపించగా, సాయంత్రం వరుణుడు కరుణ చూపాడు. ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిన జనం వర్షపుజల్లులు, చల్లని గాలులతో ఉపశమనం పొందారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆమదాలవలస, వజ్రపుకొత్తూరులో చిరుజల్లులు కురిశాయి. పొందూరు, జి.సిగడాంలో గాలులు వీచాయి.

పార్టీ కోసం పనిచేస్తాం

శ్రీకాకుళం అర్బన్ : అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి శ్రీకాకుళం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తామని తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు చెప్పారు. తమకు సముచిత స్థానం కల్పించాలని, అందుకు పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, ఎంపీ రామ్మోహన్ నాయుడు హామీ ఇవ్వాలన్నారు. గొండు శంకర్ కోసం పనిచేయడంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. పార్టీ నిర్ణయమే తమకు అంతిమమని, దానికే అందరం కట్టుబడి ఉంటామని చెప్పారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన బుధవారం సమావేశమయ్యారు. క్రియాశీలక రాజకీయాలకు గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దూరమైనట్లు ప్రకటించడంతో, అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేయాలని తీర్మానించుకున్నారు. సమావేశంలో పాల్గొన్న నగరంలోని పలు డివిజన్ల ఇన్‌ఛార్జీలు తమను భవిష్యత్‌లోనూ ఇన్‌ఛార్జీలుగా కొనసాగిస్తామనే భరోసా ఇవ్వాలని కోరారు. ఈనెల 18న మరోసారి సమావేశం నిర్వహించి ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను ఆహ్వానించి పార్టీ కోసం పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టి జనార్ధనరావు

ధర్మానతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోనే జిల్లా, శ్రీకాకుళం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని వైసిపి శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు అన్నారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని శ్రీకాకుళం, గార మండలాల్లోని 34,220 ఎకరాల భూములకు వంశధార సాగునీరు అందించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. రైతులు పడుతున్న కష్టాలు, బాధలు చూసి వంశధార ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకురావడంతో శ్రీకాకుళం సస్యశ్యామలమైందన్నారు. సాగునీరు లేక, పంటలు పండక రైతులు నానా ఇబ్బందులు పడేవారని, పశువులకు సైతం గ్రాసం లేక ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. మెట్ట భూములకూ ఆ ప్రాజెక్టు నుంచి నీరు తెచ్చారని చెప్పారు. వంశధార ప్రాజెక్టు మూలంగా హిరమండలంలోని అధిక మొత్తంలో నీటిని స్టోరేజ్ చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వేసవిలోని రెండో పంటకు నీరందించేందుకు ధర్మాన విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రధాన సమస్యగా ఉన్న శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారికి నిధులు విడుదల చేయడమైందని, 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. మరోసారి ధర్మానను గెలిపించి అభివృద్ధికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎఎంసి మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, తండ్యాంవలస సర్పంచ్ పొన్నాన కూర్మారావు, వైసిపి నాయకులు రుప్ప రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : పార్వతీశంపేటలో ట్యాంకర్ నీటిని పట్టుకునేందుకు తమవంతు కోసం వేచిచూస్తున్న మహిళలు

గొంతెండుతోంది

15,848 చేతిపంపులు ఉన్నా, ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో రోజుకు 70 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా, 55 లీటర్ల నీటిని మాత్రమే అందించగలుగుతున్నారు. ఆ మేరకు తాగునీటిని అందిస్తున్న గ్రామాలు 1521 మాత్రమే ఉన్నాయి. పాక్షికంగా తాగునీరందుతున్న గ్రామాలు 2,497 గ్రామాలు ఉన్నాయి.

పథకాల మరమ్మతులతో తప్పని ఇబ్బందులు

జిల్లాలో 192 చిన్న రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వాటిలో ఏడు పనిచేయడం లేదు. అదేవిధంగా 904 సింగిల్ విలేజ్ స్కీమ్‌లు ఉండగా, వాటిలో 65 పథకాలు పనిచేయడం లేదు. జిల్లాలో 30 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్) ఉన్నాయి. వాటిలోనూ చిన్నపాటి రిపేర్లు ఉన్నాయి. చేతిపంపులు, డైరెక్టు పంపు పథకాల్లోనూ మరమ్మతులకు గురయ్యాయి.

జిల్లాలో చేతిపంపులు, డైరెక్ట్ పంపింగ్ పథకాలు కలిపి మొత్తం 13,885 ఉన్నాయి. వాటిలో తాగునీటి యోగ్యంగా 12,808 చేతిపంపులు ఉండగా, 1077 పంపుల్లో నీరు తాగేందుకు పనికిరానిదిగా అధికారులు గుర్తించారు. తాగడానికి ఉపయోగపడే వాటిలో 271 పంపులు పనిచేయడం లేదు. తాగడానికి యోగ్యం కాని వాటిలో 37 పథకాలు మూలకు చేరాయి.

బోరుమంటున్న బావులు

జిల్లాలో మొత్తం 65 సింగిల్ విలేజ్ స్కీమ్‌లు మరమ్మతులకు గురికాగా, అందులో హిరమండలం మండలంలో అత్యధికంగా 25 పథకాలు మూలకు చేరాయి. ఎల్ఎన్‌పేటలో 20 పథకాలు, జలుమూరులో 11 పథకాలు పాడయ్యాయి. చిన్న రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి మందసలో మూడు, పలాసలో రెండు పథకాలు పాడయ్యాయి. తాగునీటికి యోగ్యం ఉన్న చేతిపంపుల్లో 271 చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. వీటిలో హిరమండలం మండలంలో అత్యధికంగా 35 పంపులు పాడయ్యాయి. మందసలో 27, రణస్థలంలో 25, ఎచ్చెర్లలో 21 పంపులు మూలకు చేరాయి.

జిల్లాలో నీటి ఎద్దడి పరిస్థితి ఇలా...

జిల్లాలో పలుచోట్ల మంచినీటి పథకాలు ఏళ్ల తరబడి ఇంకా నిర్మాణ దశల్లోనే ఉండడంతో, ఆయా గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. జలుమూరు, సారవకోట మండలాల పరిధిలోని 93 గ్రామాలకు మంచినీటిని అందించేందుకు శ్రీముఖలింగం తాగునీటి పథకాన్ని 2017లో ప్రారంభించారు. పథకానికి మొదట విడత ప్రభుత్వం విడుదల చేసిన రూ.20 కోట్లతో పనులు పూర్తి చేసి 47 గ్రామాలకు నీరందిస్తున్నారు. రెండో విడత పనులకు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపినా, నిధుల విడుదల్లో జాప్యం కావడంతో పనులు కాక మిగిలిన గ్రామాలకు నీరందని పరిస్థితి నెలకొంది.

భూగర్భ జలాలు అడుగంటడంతో మంచినీటి కోసం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ మండలం కొల్లివలసలో ఐదు చేతిపంపులు ఉన్నా, వాటిలో మూడింటిలో ఉప్పునీరే వస్తోంది. దీంతో సమీపంలోని బావి నుంచి మహిళలు నీరు తెచ్చుకుంటున్నారు. బావిలో సుమారు 50 అడుగుల లోతులోకి నీరు చేరడంతో తోడుకుని మహిళలు మోసుకువెళ్తున్నారు. వంశధార, నాగావళి, బాహుదా నదులు ఎండిపోవడంతో సమీపంలోని గ్రామాల ప్రజలు చెలమలపై ఆధారపడుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల నీరే దిక్కు

పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల నీరే దిక్కుగా ఉంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని హడ్కో కాలనీ, రాజాం కాలనీ, మున్సిపల్ కార్యాలయం వీధి, బత్తుల వీధి, నెహ్రునగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఈ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఏర్పాటయిన నాటి నుంచి మొదటి మూడు వార్డులకు తాగునీటి పైపులైన్లే ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడి ప్రజలు తాగునీటి ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు.

నేటి నుంచి నామినేషన్ల ఘట్టం

స్వీకరిస్తారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో అధికారిని రిటర్నింగ్ అధికారిగా నియమించారు. నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరిస్తారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో ఆయా ఆర్‌డిఒ కేంద్రాల్లో, ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు తీసుకుంటారు. నామినేషన్ల పత్రాల సమర్పణ కోసం రిటర్నింగ్ అధికారుల ఛాంబర్‌లోకి వెళ్లేందుకు అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. నామినేషన్లు వేసేందుకు వాహనాల్లో వచ్చే వారు వంద మీటర్ల దూరంలో నిలిపేయాల్సి ఉంటుంది. మూడు వాహనాలకు మాత్రమే అనుమతిస్తారు. ఎంపీ అభ్యర్థికి నామినేషన్ల పత్రాలతో పాటు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు... ఎస్‌సి, ఎస్‌టిలు రూ.12,500 వేలు చెల్లించాలి. ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.పది వేలు... ఎస్‌సి, ఎస్‌టిలు రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది.

రిటర్నింగ్ అధికారుల నియామకం

జిల్లాలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాల వారీ రిటర్నింగ్ అధికారులుగా పలువురు ఉన్నతాధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ నియమించారు. వీరు నామినేషన్ల ప్రక్రియ మొదలు పోలింగ్, కౌంటింగ్ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ఇచ్ఛాపురం శాసనసభ నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, పలాసకు ఆర్‌డిఒ భరత్ నాయక్, టెక్కలికి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ వ్యవహరించనున్నారు. పాతపట్నం నియోజకవర్గానికి ఆటవీ సెటిల్‌మెంట్ అధికారి ఎం.అప్పారావు, శ్రీకాకుళంకు ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఆమదాలవలసకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, నరసన్నపేటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.వి.ఎస్.ఎస్ రామ్మోహనరావు, ఎచ్చెర్లకు కొవ్వాడ భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి లక్ష్మణమూర్తిని నియమించారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షకులుగా ఐఎఎస్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా శేఖర్ విద్యార్థి... ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు సందీప్‌కుమార్... ఎచ్చెర్ల, విజయనగరం జిల్లాలోని రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాలకు టి.పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లను నియమించింది. వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారులు కె.కె శ్రవణ్ కుమార్, కోమల్‌జిత్ మీనా, నవీన్‌కుమార్ సోని, పోలీస్ పరిశీలకునిగా చెందిన సచీంద్ర పటేల్ నియమితులయ్యారు.

రాష్ట్రాన్ని ప్రజలే రక్షించుకోవాలి

టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయని తెలిపారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో విధ్వంసమే తప్ప అభివృద్ధి ఎక్కడా కానరాలేదని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని లూటీ చేశారని, చివరకు కొండలు, గుట్టలను సైతం విడిచిపెట్టలేదన్నారు. రాష్ట్రం కోలుకోవాలంటే మరో 20 ఏళ్లు పడుతుందన్నారు. చైతన్యవంతులైన ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని తరిమికొట్టి తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, కూటమి నాయకులు పేడాడ రామ్మోహనరావు, సూరపు నాయుడు, కణితి విజయలక్ష్మి భాయ్, నూక రాజు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ సనపల అన్నపూర్ణ, తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, మెండ దాసునాయుడు, మెట్ట సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

పంపించిన ఘనత రామ్మోహన్ నాయుడుకే దక్కుతుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఆయన్ను తప్పక ఓడిస్తారన్నారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడుగురు శాసనసభ అభ్యర్థులు, ముఖ్య నేతలతో కలిసి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. జెడ్‌పి చైర్మన్ అభ్యర్థిగా, 2019లో టెక్కలి అసెంబ్లీ స్థానానికి పోటీలో నిలబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిపారని తెలిపారు. ఐదేళ్ల జగన్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వివక్ష లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాల ఆర్థిక ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్న కృతజ్ఞత ప్రజల్లో కనిపిస్తోందన్నారు.

కిడ్నీ బాధితులకు భరోసా కల్పిస్తూ రూ.70 కోట్లతో రీసెర్చ్ సెంటర్, రూ.700 కోట్లతో 800 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రూ.180 కోట్లతో కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేసిన గొప్ప మానవతావతావాది అని కొనియాడారు. వంశధార నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి టైలాండ్ వరకు నీరందించారన్నారు. మూలపేట పోర్టు నిర్మాణంతో జిల్లాలో వలసలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని చెప్పారు. జిల్లాపై టిడిపి కపటప్రేమ చూపిస్తోందన్నారు. సమావేశంలో కళింగ వైశ్య, శ్రీశయన కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, డి.పి దేవ్, టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ఎం.వి స్వరూప్, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, నందిగాం ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌టి, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. ప్రాపర్టీ కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఈనెల 18వ తేదీన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నిర్వహణకు పోలీసు అధికారులు తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐలు, సిఐలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో స్వయంగా ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిఐలు, డిఎస్‌పిలు ఆకస్మికంగా వాహనాలు తనిఖీలు చేపట్టాలన్నారు.

నిఘా, సమాచార వ్యవస్థను పటిష్టపరిచి, వాహనాల తనిఖీలు ముమ్మరం చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఎస్‌పి జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శ్రుతి, బి.నాగేశ్వర్‌రెడ్డి, త్రినాథరావు, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ఎల్.శేషాద్రి నాయుడు, పోలీసు లీగల్ అడ్వైజర్ యామనిరాణి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కుపై నిర్లక్ష్యం



మాయమైన ఆట వస్తువులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 15వ వార్డు మోణింగి వారి వీధిలో ఉన్న నెహ్రూ చిల్డ్రన్ పార్క్ గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై పిల్లలకు ఆనందం కరువైందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఉన్న కనకాద్రి చెరువులో 2017లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.3 లక్షల వ్యయంతో ఈ పార్కును అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పార్కును ప్రభుత్వ విప్ కూన రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ 2017 నవంబర్ 8న ప్రారంభించి పట్టణ ప్రజలు ఆహ్లాదం పొందేందుకు వినియోగంలోకి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పిల్లల పార్కు ప్రారంభ సమయం నుంచి రెండేళ్ల వరకు సాయంత్రం వేళ, సెలవుల రోజు పార్క్ లోపల ఏర్పాటు చేసిన ఊయల, జారుడు బల్లలు చిన్నారులకు ఎంతో ఆనందాన్ని కలిగించేవి. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారం చేపట్టిన తర్వాత ఈ పార్కు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూ చిల్డ్రన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఊయలలు, జారుడు బల్లలు పూర్తిగా విరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే పార్కులో ఏర్పాటు చేసిన భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ విగ్రహం ఏర్పాటు చేయటం పట్ల అప్పటి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధిని చూపింది. ప్రస్తుత ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్ అధికారులు కూడా పూర్తిగా నిర్లక్ష్యం వహించారని చెప్పటానికి నెహ్రూ విగ్రహ రూపురేఖలే తెలుపుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు ముఖద్వారం చూడటానికి చక్కగా కనిపించినప్పటికీ లోపల బడారం బయట పటారం అన్న సామెత మాదిరిగా పార్క్ లోపల భాగమంతా పిల్లలు ఆటలాడుకునే సామాగ్రి పూర్తి శిథిలావస్తకు చేరుకోవడంతో పాటు పరిసర ప్రాంతాలు కూడా చిందర వందరగా మారాయి. ముఖ్యంగా గత ఐదేళ్ల నుంచి చిన్నారుల పార్కు నిర్లక్ష్యానికి గురైందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మున్సిపల్ పరిధిలో ఉన్న ఆరు పార్కుల పరిస్థితి కూడా అధ్వాన్నస్థితిలో ఉన్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజల నుంచి అనేక రకాల పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు అందించాల్సిన కనీస సేవల్లో కూడా శ్రద్ధ చూపకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



కళావిహీనంగా మారిన నెహ్రూ విగ్రహం

'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఇండియా ఫోరం తరుపున పోటీ చేస్తున్న అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరసయ్య, పాలకొండ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబును గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.సుబ్బరావమ్మ, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం అభ్యర్థులు అప్పలనరసయ్య, చంటిబాబు పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి యాలాం కూడలి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అప్పలనరసయ్య ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీతంపేట సిపిఎం కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్, సిపిఎం, సిపిఐతో పాటు 27 పార్టీలు కలిసి ఇండియా ఫోరం తరుపున పోటీ చేస్తున్నాయని చెప్పారు. గిరిజన, కార్మిక హక్కుల రక్షణ, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనరసయ్యను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శివర్గ



సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, ఎస్.ప్రసాదరావు, నాయకులు కె.సూరయ్య, ఆర్.ప్రకాశరావు, మన్యం జిల్లా కమిటీ సభ్యులు ఆరిక.భాస్కరరావు, పాలకొండ మండల కార్యదర్శి దావాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడకం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. పంచాయతీ అధికారులు, సిబ్బంది గత కొన్ని సంవత్సరాల నుంచి కనీసం నామమాత్రంగా కూడా దాడులు చేయకపోవడం, చూసి చూడనట్లు వ్యవహరించడంతో వినియోగం చాలా ఎక్కువైంది. ప్రతిరోజూ 25 శాతం ప్లాస్టిక్ కవర్లు వస్తుండటం ఆందోళన కలిగించే విషయం. అన్ని గ్రామాల్లో రోడ్ల మీద, వీధుల్లో ఎటుచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. మురుగు కాల్వలు, చెరువులు, కుంటలు, చెత్తకుప్పలో పాలిథిన్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పర్యావరణానికి ముప్పు వస్తున్న ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని క్రయ విక్రయదారులతో పాటు అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణ లున్నాయి. 2016లో ప్లాస్టిక్ నిషేధం అమలుల్లోకి తెచ్చారు. ఆహారాన్ని ప్లాస్టిక్ కాగితాల్లో ప్యాక్ చేయడం, సరఫరా చేయడం నిషేధమంటూ కచ్చితమైన నిబంధన తీసుకొచ్చారు. అయినా అది ఎక్కడా అమలు కావడం లేదు. రణస్థలం మండల కేంద్రంలోని ప్లాస్టిక్ కవర్ల నిషేధం కోసం తీర్మానాలు చేసినా ఆచరణలోకి రాలేదు. మండల పరిధిలో ఎక్కడపడితే అక్కడ పాలిథిన్ కవర్లను వినియోగి స్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో 90 శాతానికిపైగా 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే కవర్లను ఉపయోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. టన్నుల ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతున్నా ప్రత్యేకంగా దృష్టి సారించిన సందర్భాలు లేవు. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. నిషేధిత కవర్లను బహిరంగంగానే విక్రయిస్తున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. మరోవైపు విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ కవర్లు టన్నుల కొద్దీ దిగుమతి అవుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, ప్రత్యామ్నాయ పద్ధతులు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలకు మరోమార్గం లేకపోవడం కూడా వినియోగం పెరగడానికి ఓ కారణమవుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు దీనిపై కఠినంగా వ్యవహరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పాలి.

పలాసకు చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి- పలాస

మే 13న జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల్లో భాగంగా బుధవారం రాత్రి పలాస ఇవిఎంలు చేరుకున్నాయి. పలాస నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి 680 ఇవిఎంలు వచ్చినట్లు పలాస ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ తెలిపారు. వాటిని టిడిపి, బిజెపి, కాంగ్రెస్, జనసేన రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్థానిక జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టి భద్రపరిచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య ఇవిఎంలు భద్రపరిచారు.



ఇవిఎంలను భద్రపరుస్తున్న అధికారులు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 112వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా బెంతు ఒరియా ప్రతినిధులు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



దీక్షలో పాల్గొన్న నెలవంక బెంతు ఒరియాలు

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: వేసవి వచ్చింది. ఉక్కపోతతో పాటు కష్టార్జితం కూడా పరులపాలైపోయే అవకాశం ఉంది. వేసవి ఉక్క అంటూ మేడలపై నిద్రిస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ తంతు తప్పదు. అలాంటి సమయంలో ఇళ్లకు తాళాలు సరిగా వేయరు. ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోతుంటారు. మిగతా కాలాల కంటే వేసవిలోనే ఎక్కువగా చోరీలు జరుగుతుంటాయని పోలీసులు చెబుతుంటారు. అందుకే అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. అందుబాట్లో ఉన్న సాంకేతిక వ్యవస్థను ఉపయోగించుకోవాలని కోరుతున్నారు. అవసరార్థం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, వేసవి సెలవుల నిమిత్తం ఊరెళితే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించడం, లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం (ఎలాచ్ఎంఎస్)పై దృష్టిసారించడం, ఖరీదైన వస్తు సామగ్రి బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవడం వంటివి చేయాలి. నేరం జరిగిపోయిన తరువాత బాధ పడే కంటే ముందే జాగ్రత్తగా ఉండడం మంచిది కదా అని పోలీసులు సూచిస్తున్నారు.

కారణాలు ఇవీ...

వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలుంటాయి. అదే సమయంలో గ్రామాల్లో పండగలు, జాతరలు ఉంటాయి. పిల్లలకు వేసవి సెలవులొస్తుంటాయి. అందుకే ఇంటి నుంచి బయటకు కుటుంబాలతో సహా తీర్థయాత్రలు, విహార యాత్రలకు పయణమవుతుంటారు. ఉక్కపోత కారణంగా ఇంటికి తాళం వేయకుండా ఆరుబయట, మేడలపైన నిద్రిస్తుంటారు. అలాంటి సమయాల్లోనూ ఒంటిపై అధికంగా బంగారు వస్తువులు వేసుకోకూడదు. వేసవి నేపథ్యంలో వాకింగ్, జాగింగ్‌కు వెళ్లేటప్పుడు కూడా చైన్ స్నాచర్లు అనుసరించే అవకాశం ఉంది. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే కచ్చితంగా పోలీస్ కంట్రోల్ రూం 100కు ఫోన్ చేయాలి. సమీప పోలీస్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవడం మంచిది.



మృతి చెందిన శ్రీధర్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని సింగపురం పంచాయతీ మునసబు పేట సమీపంలో మంత్రి శ్రీధర్(35) అనే వ్యక్తి బుధవారం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు ఒప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఎరువులు వ్యాపారం చేస్తూ ఉండేవాడు. శ్రీధర్‌ది ఉమ్మడి కుటుంబం. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రతిరోజులా షాప్‌కు బయలుదేరాడు. షాపును తెరచి షాపులో ఉన్న పురుగుల మందును తన వెంట తీసుకొని ఎవరూ లేని సమయంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ మార్గం గుండా వెళ్లే జనాలు చూసి వెళ్లేసరికే శ్రీధర్ మృతి చెందాడు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మూడు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి కంచ్రడి వీధిలో అనంత్ కార్తీక్, అనంత అమర, అనంత ఉపేంద్ర పూరిళ్లు బుధవారం దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఈ ప్రమాదంలో ఆధార్, రేషన్, విద్యుత్ మీటరు, దుస్తులు కాలిపోయాయని బాధితులు తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తప్పిన అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

మండలం పిల్లలవలస గ్రామం వద్ద చెరకు, మొక్కజొన్న తోటలకు బుధవారం మంటలు అంటుకోవడంతో రైతులు సకాలంలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రమాదం తప్పింది. చెరువులో ఆవురు గడ్డికి మంట పెట్టగా అది వ్యాపించి పక్కనే గల చెరుకు, మొక్కజొన్న తోటలకు అంటుకుంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడ చేరుకుని మంటలను ఆర్పడంతో రైతులు వావిలపల్లి తిరుమలరావు, గురుగుబల్లి ముకుంధరావులకు స్వల్ప నష్టం వాటిల్లింది.

జీడితోట దగ్ధం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగపురానికి చెందిన నక్క ముత్యాలమ్మకు చెందిన ఎకర జీడి తోటకు బుధవారం దగ్ధమైంది. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది శంకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. పింది దశలో ఉన్న జీడి తోట కాలిపోవడంతో బాగా నష్టపోయాయని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విన్నవించారు. విషయం తెలుసు కున్న జనసేన నాయకులు బాలరాజు పరిశీలించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలాసలో ఒక్క ఛాన్సే

అప్పలరాజు తిరగరాస్తారా!



జగన్నాయకులు గౌతు శివాజీ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో ఎవరు గెలిచినా ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యే పదవి దక్కుతుంది. తర్వాత ఎన్నికలకు దూరమవుతున్నారనే వాదనా వినిపిస్తోంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత పలాస నియోజకవర్గం ఏర్పడింది. మొదటి ఎమ్మెల్యేగా కీర్తిశేషులు జుత్తు జగన్నాయకులు, రెండో ఎమ్మెల్యేగా గౌతు శ్యాంసుందర శివాజీ, మూడో ఎమ్మెల్యేగా ప్రస్తుత పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గెలుపు పొందారు. గతంలో పలాస నియోజకవర్గంలో గతంలో పలాస ప్రాంతమంతా సోంపేట నియోజకవర్గంలో ఉండగా, కాశీబుగ్గ ప్రాంతమంతా టెక్కలి నియోజకవర్గంలో ఉండేది. ఆ సమయంలో కీర్తిశేషులు జుత్తు జగన్నాయకులు సోంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ... గౌతు శివాజీపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటికే గౌతు శివాజీ ఏకధాటిగా ఎమ్మెల్యేగానే కొనసాగారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో నియోజకవర్గాలను విభజన చేశారు. దీంతో 2009లో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కలిపి పలాస నియోజకవర్గంగా ఏర్పడింది. 2009లో అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నియోజకవర్గం నుంచి జుత్తు జగన్నాయకులు, గౌతు శివాజీ పోటీ చేశారు. అప్పటికే విజయంతో కొనసాగుతున్న గౌతు శివాజీపై సుమారు ఆరు వేల ఓట్లు తేడాతో జగన్నాయకులు గెలుపొంది మొట్టమొదటి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికల ముందు రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైంది. ఆ సమయంలో ఎమ్మెల్యేగా జుత్తు జగన్నాయకులకు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పెట్టిన వైసిపిలో చేరినా ఎమ్మెల్యే టిక్కెట్ లభించలేదు. 2014లో వైసిపి తరుపున వజ్జ బాబూరావు, టిడిపి తరుపున గౌతు శివాజీ పోటీ చేశారు. ఈ పోటీలో శివాజీ సుమారు 17 వేలు మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా కొనసాగుతూ శివాజీ రాజకీయాలకు స్వస్తి చెప్పి తన కుమార్తె గౌతు శిరీషను రాజకీయ ప్రవేశం చేయించారు. అప్పటికే వైసిపి నుంచి పోటీ చేసిన వజ్జ బాబూరావు టిడిపిలో చేరిపోయారు. పలాసలో వైద్యులుగా ఉన్న డాక్టోర్ సీదిరి అప్పలరాజు వైసిపి పలాస నియోజకవర్గం బాధ్యతలను స్వీకరించారు. దీంతో పలాసలో నూతనంగా రాజకీయాల్లోకి వచ్చిన గౌతు శిరీష, సీదిరి అప్పలరాజు 2019 ఎన్నికల్లో తలపడ్డారు. సుమారు 16 వేలు ఓట్లు మెజారిటీతో సీదిరి అప్పలరాజు విజయం సాధించారు. అయితే ఇప్పటి వరకు పలాస నియోజకవర్గంలో టిడిపి, కాంగ్రెస్, వైసిపి అబ్యర్థులు ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యేగా విజయం సాధించి పలు కారణాలతో మరలా పోటీ చేయకపోవడం, రాజకీయాలకు దూరం కావడం, జుత్తు జగన్నాయకులు మృతి చెందడం జరిగింది. ప్రస్తుతం పలాస నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మజ్జి త్రినాథ్‌బాబు, టిడిపి నుంచి గౌతు శిరీష, వైసిపి నుంచి సీదిరి అప్పలరాజు పోటీ చేసేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. పలాసలో ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యేగా ఎంపికవుతున్న తరుణంలో 2024 ఎన్నికల్లో మరలా సీదిరి అప్పలరాజు గెలిచి చరిత్ర తిరగ వేస్తారో... లేక టిడిపి నుంచి గౌతు శిరీష, కాంగ్రెస్ నుంచి మజ్జి త్రినాథ్‌బాబు గెలిచి పాత సంప్రదాయాన్ని కొనసాగిస్తారా అన్నది వేచిచూడాల్సి ఉంది.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని నగరం పల్లి మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి ఆధ్వర్యాన గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇరవై కుటుంబాలకు చెందిన శనపల ఈశ్వరప్ప, సనపల సుదర్శన తదితరులు టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పేదలు కోసం ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని ఆమె అన్నారు. ఒక్కఛాన్స్ అంటూ జగన్ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గౌతు కుటుంబంపై బురద జల్లుతూ అబద్ధాలతో కాలం



పార్టీలో చేరిన వారితో గౌతు శిరీష

గడుపుతున్నారు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఎలగులు గ్రామాల్లోకి వచ్చి ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయింటే దానికి మంత్రి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ఆరు నెల్లలోనే అభివృద్ధి చేసి చూపిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ దుర్గారావు,, దువ్వాడ హేమచౌదరి, దువ్వాడ అప్పారావు, కణితి సురేష్, సూరాడ మోహనరావు, ఉమామహేశ్వరరావు, సనపల చక్రవర్తి, సైనీ బాలాజీ పాల్గొన్నారు.

పలాస : నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని నారాయణపురంలో బుధవారం రాత్రి సుమారు 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో పర్యటించి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మందస మండలంలోని నల్లబొడ్డులూరు కొండను మింగేశారని ఆరోపించారు. మండలంలోని రిజర్వాయర్ల నుంచి పంట భూములకు సాగునీరందని పరిస్థితి ఉన్నా.. వాటిపై మంత్రి దృష్టి పెట్టలేదన్నారు. ఐదేళ్లలో కనీసం పాడైన రిజర్వాయర్లకు మరమ్మతులు చేపట్టడం లేదని అన్నారు. కార్యక్రమంలో బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, మడియా ధర్మారావు తులసి వీరాస్వామి, గున్నయ్య రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలి



ప్రచారం చేస్తున్న గాంధీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని వంజంగి, వంజంగిపేటలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్ద కాలంగా గ్రామాల్లో ప్రజల సమస్యలను గాలికి వదిలేసారన్నారు. ప్రజలను సమస్యల్లోకి నెట్టి నాయకులు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో ఎండ రాజేశ్వరావు, అన్నపూర్ణమ్మ, బెండి నారాయణ రావు, లక్ష్మీనారాయణ, పి రాజారావు, సోమేశ్, సుధాకర్, వై. లక్ష్మణ్, వై.డొంకయ్య, పి.నరసింగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం



రిటర్నింగ్ అధికారుల నియామకం

జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాల వారీ రిటర్నింగ్ అధికారులుగా పలువురు ఉన్నతాధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం నియమించారు. వీరు నామినేషన్ల ప్రక్రియ మొదలు, పోలింగ్, కౌంటింగ్ బాధ్యతలను పర్యవేక్షిస్తారు.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	హోదా	ఫోన్ నంబరు	కంట్రోల్ రూం
ఇచ్ఛాపురం	బి.సుదర్శనదొర	స్పెషల్ డెప్యూటీ కలెక్టర్	9494326124	9114115363
పలాస	భరత్ నాయక్	ఆర్‌డిఒ	8333989275	6302384049
టెక్కలి	నూరల్‌కమర్	సబ్ కలెక్టర్	8333988802.	9063757478
పాతపట్నం	ఎం.అప్పారావు	ఫారెస్టు ఎస్ఎ	9398764880	8125213524
శ్రీకాకుళం	సిహెచ్.రంగయ్య,	ఆర్‌డిఒ	9573356699	9032601471
ఆమదాలవలస	ఎం.నవీన్	జాయింట్ కలెక్టర్	8143193111	9032318521
ఎచ్చెర్ల	ఎస్.వి.లక్ష్మణమూర్తి	కొవ్వాడ డెప్యూటీ కలెక్టర్	9121251111	8942 298767
నరసన్నపేట	జెవిఎస్ఎస్ రామ్మోహనరావు	వంశధార డెప్యూటీ కలెక్టర్	9440422302	8331995443

22న రెడ్డి శాంతి నామినేషన్

ప్రజాశక్తి- పాతపట్నం

ఈ నెల 22న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు రెడ్డి శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. నామి నేషన్ చట్టానికి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నామినేషన్ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం కేంద్రం లో నిర్వహించే ర్యాలీలో ప్రజలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ సారధి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి రెండో పర్యాయం ముఖ్యమంత్రిగా చేసేందుకు



రెడ్డి శాంతి

నియోజకవర్గం ప్రజలకు సిద్ధంగా ఉన్నారన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే గా గెలిపించి జగన్‌కు బహుమతిగా ఇచ్చేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాతపట్నం అభివృద్ధి పథంలో నడిపించడానికి జగన్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అన్ని తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు నిచ్చక్షపాతంగా, పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు. దీనికి ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనే అని అన్నారు. అవినీతి లేని పాలన అందించడం, ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడంలో ఐదేళ్ల జగన్ కృషి చేశారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే స్థితి లేరని వ్యాఖ్యానించారు. 2019లో విడుదల చేసిన వైసిపి మేనిఫెస్టోలో 98 శాతం నెరవేర్చామన్నారు.

22న 'కింజరాపు' నామినేషన్

ప్రజాశక్తి- టెక్కలి



అచ్చెన్నాయుడు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తన నామినేషన్ దఖలు పర్చనున్నారు. ఇందుకోసం సంబంధించిన ఏర్పాట్లను స్థానిక టిడిపి నాయకులు పరిశీలిస్తున్నారు. 50 వేల మంది అభిమానులు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ముందుగా కోటబొమ్మాళి మండలం కొత్తమ్మతల్లి ఆలయాన్ని సందర్శించనున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా టెక్కలి అంబేద్కర్ కూడలికి చేరుకుంటారు. అక్కడి నుంచి నామినేషన్ వేసిన వెంటనే నిర్వహించనున్న సభలో మాట్లాడనున్నారు. టెక్కలి నియోజకవర్గం నలుమూలల నుంచీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేందుకు వీలుగా పార్టీ నాయకులకు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. దీంతో టిడిపి నాయకులు జనసమీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసిపి, టిడిపి దొందూదొందే

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి, టిడిపి పార్టీలు దొందూదొందేనని కాంగ్రెస్ అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండు ఒక్కటేనని, విధ్వంసమే తప్ప ఎటువంటి అభివృద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన పదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. జిల్లాలో అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ 1,4300 ఎకరాలకు సాగునీరు అందించే అక్కులపేట లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు గురైతే నేటికీ దానిని పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద గోపాల్, కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నాజీరావు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గంలో వివిధ పార్టీల తరుపున పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం సిద్ధమైంది. ఇందు కోసం కార్యాలయంలో ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ నూరల్ కమర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా కార్యాలయానికి అందివ్వాల్సిన పత్రాలను సిద్ధం చేశారు. ఉదయం 11 నుంచి నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ప్రకియ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అధికారులందరూ కార్యాలయంలోనే ఉండేవిధంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి వంద మిటర్ల దూరంలోనే అభ్యర్థికి చెందిన వాహనాలు నిలిపివేసేందుకు కావాల్సిన బారికేడ్లను ఏర్పాటు చేశారు.

అభ్యర్థి కార్యాలయాంలోకి వచ్చినప్పటి నుంచి నామినేషన్ వేసి మరలా తిరిగి వెళ్తే సమయం వరకూ ప్రతి కదలికను వీడియోలో బంధించనున్నారు. వీటితో పాటు సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయడానికి తేదీలు, ఏర్పాట్లు పూర్తి చేశారు.




సబ్ కలెక్టర్ కార్యాలయం

టిడిపి కోటలో పాగాకు వైసిపి కసరత్తు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో మొదటి నియోజకవర్గం ఇచ్ఛాపురంలో టిడిపి ఆవిర్భావం నుంచీ కంచుకోటగా నిలుస్తుంది. 1983 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో కేవలం ఒకేఒక్కసారి 2004లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేష్ కుమార్ అగర్వాల్ (లల్లూ) విజయం సాధించారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నా ఇచ్ఛాపురంలో మాత్రం టిడిపి విజయం సాధించింది. దీంతో టిడిపికి కంచుకోటగా నిలిచింది. ఈ కోటలో ప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ, వైసిపి పార్టీలు అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. వచ్చే ఎన్నికల్లో ఈ కంచుకోట చేజిక్కించుకోవాలని వైసిపి అగ్ర నాయకత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. అందులో భాగంగానే సామాజిక తరగతుల వారీగా ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది. కానీ, అధిష్టానం ఆలోచన ఒకలాగా ఉంటే, పదవులు పొందిన నేతలు ఎమ్మెల్యే టిక్కెట్ కోసం పోటీపడ్డారు. దీంతో ముఖ్య నేతల మధ్య సయోధ్య దెబ్బతింది. పరిస్థితి చెయ్యి దాటకముందే మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం తరగతుల బలం కంటే... వ్యక్తులకే ప్రాధాన్యత ఇస్తారనేది గత ఎన్నికలు రుజువు చేసింది. మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు ఎం.వి.కృష్ణారావుకు తరగతి బలం లేకపోయినా వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. నాలుగోసారి ఆయన బలపరిచిన దక్కత్ అచ్యుత రామయ్యరెడ్డి ఘన విజయం సాధించారు. టిడిపి అధినేత ఎన్‌టిఆర్ మరణం తరువాత జరిగిన 1996 లోకసభ ఎన్నికల్లో ఎం.వి.కృష్ణారావు ప్రచారం చేయడంతో ఇక్కడ సెగ్మెంట్‌లో టిడిపికే మెజారిటీ వచ్చింది. ఈ నియోజకవర్గంలో తరగతి బలం ఉన్నా.. నేతలకు టిక్కెట్ ఇచ్చినా ప్రయోజనం లేదు. 1983-85లో ఒరియా మైనారిటీ సొండి తరగతికి చెందిన లాభాల సుందరరావుకు, 1989-94లో రెడ్డి తరగతికి చెందిన బుద్దాల త్రినాథ్‌రెడ్డిలకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది. అయినా ఫలితం లేకపోయింది. 1999లో కాంగ్రెస్ టిక్కెట్ కోసం గట్టి పోటీ ఉండేది. కాంగ్రెస్ అధిష్ఠానం చివరకు 'లల్లూ'కి ఇచ్చింది. కానీ, ఆ ఎన్నికలోనూ నాలుగోసారి ఎం.వి.కృష్ణారావు తక్కువ ఓట్లతో విజయం సాధించారు. ఆ తరువాత 2004లో టిడిపి నుంచి రెడ్డి తరగతికి చెందిన దక్కత ఏకాంబరిదేవి, కాంగ్రెస్ నుంచి నరేష్ కుమార్ అగర్వాల్ పోటీ పడ్డారు. ఈ పోటీలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడంతో మొదటసారిగా టిడిపి ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేష్ కుమార్ అగర్వాల్ అఖండ విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో ప్రజారాజ్యం ప్రభంజనం ఉన్న సమయంలో టిడిపి అభ్యర్థిగా కేవలం 15 రోజులు ముందుగా టిడిపి అధిష్టానం పిరియా సాయిరాజ్‌కు టిక్కెట్ ఇచ్చింది. దీంతో త్రిముఖ పోటీ జరిగింది. టిడిపి, కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీకి చెందిన నేతలు పోటీ పడ్డారు. ప్రజారాజ్యం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇద్దరూ యాదవవులు కావడంతో ఈ ఎన్నికల్లో అనూహ్యంగా టిడిపి అభ్యర్థి సాయిరాజ్ విజయం సాధించారు. తరువాత రాష్ట్ర విభజన సమయంలో రాజీనామా చేసి వైసిపిలోకి వెళ్లిపోయారు. 2019లో మొదటి సారిగా టిడిపి అభ్యర్థిగా బెందాళం తొలిసారిగా పోటీలో నిలబడ్డారు. ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి నర్తు రామారావు రామారావు పోటీ చేశారు. ఇందులో టిడిపి అభ్యర్థి అశోక్ విజయం సాధించారు. 2019లో టిడిపి తరపున మళ్లీ అశోక్‌కు టిక్కెట్ ఇవ్వడం, ప్రత్యర్థి పార్టీ వైసిపి నుంచి పిరియా సాయిరాజ్ పోటీ పడ్డారు. కానీ, టిడిపి అభ్యర్థి అశోక్ విజయం సాధించారు. 2019లో రాష్ట్రంలో వైసిపి గాలి వీచినప్పటికీ... ఇచ్ఛాపురంలో మాత్రం టిడిపి విజయం సాధించింది. వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్, వైసిపి అభ్యర్థి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బరిలో ఉన్నారు. ఇప్పటికే ఎవరికి వారు విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ఎన్నికలు వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకుని టిడిపి కంచుకోటలో పాగా వేసేందుకు విస్తృతంగా పావులు కదుపుతున్నారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ విజయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వైసిపి నాయకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు, పార్టీల్లో చేరికలు జోరుగా సాగుతున్నాయి. వ్యూహప్రతివ్యూహాలు, ఎత్తులకు పై ఎత్తులు చేస్తూ ఎన్నికల రణరంగంలో తమ సత్తా చూపేందుకు రెండు పార్టీలూ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే... మహిళా ఓటర్లు సుమారు ఏడు వేల వరకు ఉన్నాయి. ఈ మహిళా ఓటు బ్యాంకు తమకంటే తమకే వస్తాయని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మొత్తం మీద ఈ ఎన్నికలు రెండు ప్రధాన పార్టీలకు అగ్ని పరీక్షలా మారడంతో ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



పొరుగు నేతలకు 'పట్టం'

- అక్కున చేర్చుకున్న జిల్లా ప్రజలు
- వి.వి గిరి నుంచి రెడ్డి శాంతి వరకు...
- నియోజకవర్గం మారినా నేతలకు అవకాశం



ఎన్.జి రంగా ఎన్.టి రామారావు వి.వి గిరి

స్థానికేతర నినాదం.. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో తెరపైకి వస్తూనే ఉంది. జిల్లా, నియోజకవర్గం మారి వచ్చారని ప్రత్యర్థులు ప్రచారం చేసినా... ప్రజలు పట్టించుకోరని చరిత్ర చెబుతోంది. ప్రాంతంపై అవగాహన, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకునే వ్యక్తికే ప్రజలు పట్టం కడుతూ వస్తున్నారు. తొలినాళ్లలో వి.వి.గిరి నుంచి నేటి రెడ్డి శాంతి వరకూ నేతలను ఆదరించి శాసనసభకు, పార్లమెంట్‌కు పంపించారు జిల్లావాసులు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహారాష్ట్రలోని నాసికాత్రయంబకంలో పుట్టిన గోదావరి నది ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలం చేస్తోంది. ఈ వాస్తవం కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా? అని 1967లో ఓ ఎన్నికల సభలో ఆవేశంతో ప్రశ్నించారు కీర్తిశేషులు సర్దార్ గౌతు లచ్చన్న. తన రాజకీయ గురువు ఆచార్య ఎన్.జి.రంగాను స్వతంత్ర పార్టీ తరుపున శ్రీకాకుళం లోక్‌సభలో బరిలో దించారు. నాటి ఎన్నికల ప్రచారసభలో కాంగ్రెస్ స్థానికేతర అంశాన్ని తెరపైకి తీసుకురావడంతో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొడ్డేపల్లి రాజగోపాలరావుతో పాటు ఇతర నాయకులంతా స్థానికేతరుడైన రంగా ఇక్కడ పోటీ చేయడమేమిటని ప్రచారంలో దుమ్మెత్తి పోశారు. చిత్తూరులో చిత్తుగా ఓడిపోయిన నాయకుడిని ఇక్కడ అదే పని చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అయితే ఎన్నికల ప్రచార సభల్లో రంగా ప్రసంగాలు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించాయి. స్థానికేతరుడని భావించకుండా రంగాకు పట్టం కట్టి ఢిల్లీకి పంపించారు జిల్లా ప్రజలు.

జిల్లాలు దాటి వచ్చిన వారిని..

టిడిపి ఆవిర్భావం తరువాత ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన ఎం.వి.కృష్ణారావు స్థానికేతరులే. 2009 నియోజకవర్గాల పునర్విభజన ముందు జిల్లాలోని జి.సిగడాం, పొందూరు మండలాలు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో ఉండేవి. ఆ నియోజకవర్గం నుంచి గెలుపొందిన గద్దె బాబూరావు స్థానికేతరులే. 1994లో టెక్కలి నియోజకవర్గం నుంచి ఎన్‌టిఆర్, 1996లో పాతపట్నం ఉప ఎన్నికల్లో లక్ష్మీపార్వతిని ప్రజలు గెలిపించారు. ఈ దంపతులిద్దరూ ఇతర జిల్లాలకు చెందినవారే. ఉమ్మడి విజయనగరం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాకు చిన్నమెరంగికి 2009 ఎన్నికల్లో చెందిన శత్రుచర్ల విజయరామరాజు పాతపట్నం నుంచి పోటీ చేసి గెలుపొందారు. జిల్లాలు దాటి వచ్చిన వీరిని ప్రజలు ఆదరించారు.

నియోజకవర్గాలు మారినా..

1972లో పొందూరు నియోజకవర్గం నుంచి గెలిచిన లుకలాపు లక్ష్మణదాస్ పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన పాతపట్నం నియోజకవర్గానికి చెందిన వారు. 1955లో చీపురుపల్లి నుంచి, 1962లో పొందూరు నుంచి ఎన్నికైన కొత్తపల్లి పున్నయ్య స్వగ్రామం బారువ. ఆయన కుమార్తె మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి ఎచ్చర్ల నియోజక వర్గం నుంచి అయిదుసార్లు గెలుపొందారు. ఈమెది ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం విజయనగరం జిల్లా సంతకవిటి మండల కావలి. 1952లో పాతపట్నం లోక్‌సభ నియోజ కవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందిన వి.వి. గిరిది ఒడిశాలోని బరంపురానికి చెంది వారు. శ్రీకాకుళం నుంచి గెలుపొందిన ధర్మాన ప్రసాద రావు, ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి గెలుపొం దిన కిమిడి కళావెంకటరావులు స్థానికేతరులే. ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన హరిబాబు నాయుడు పాతపట్నం నుంచి రెండుసార్లు పోటీ ఓటమి పాలయ్యారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కూడా స్థానికేతరురాలే.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


రణస్థలం : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖాధికారి పైల అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వీధుల్లో, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి పోస్టర్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అగ్ని ప్రమాదాలపై అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, దీనివలనే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే 101కు ఫోన్ చేసి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.పొలినాయుడు, ఎ.రాము, సిహెచ్ నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి చక్రధరరావు అన్నారు. మండలంలోని గాజుల కొల్లివలసలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పలాస: అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గ జీడి పారిశ్రామిక వాడలో అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎం.రమెషీనాయా, కె.గోల్ఫ్, ప్రేమ కుమార్, రామనామ పాల్గొన్నారు.


ఆమదాలవలస : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చక్రధరరావు


పలాస : అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు


మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాగళం విజయవంతం

ప్రజాశక్తి- పలాస

పలాసలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం విజయవంతమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు సిఎం, పలాస నియోజకవర్గంలో గౌతు శిరీష ఎమ్మెల్యే చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాగళానికి వచ్చిన జనాలను చూసి పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఓర్వలేక చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పలాస నియోజకవర్గంలో డ్రెయినేజీలు, రోడ్లు, ఆఫ్‌షోర్, వంతెనల నిర్మాణం చేపట్టాలేని అప్పలరాజు చంద్రబాబును విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని దామోదరపురంలో ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముందుగా చదరంగం అసోసియేషన్ నాయకులు సనపల భీమారావు ప్రారంభించారు. దామోదరపురం ప్రీమియర్ లీగ్‌లి క్రికెట్ పోటీల్లో భాగంగా మొదటి మ్యాచ్‌లో సీతానగరం జట్టు విజయం సాధించింది. సీతానగరంతో తలపడిన చుక్కావానిపేట జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 61 పరుగులు చేసింది. 62 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సీతానగరం జట్టు రెండు ఓవర్లు మిగిలి ఉండగానే ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. అలాగే రెండో మ్యాచ్‌లో నౌపడ ఆర్ఎస్ జట్టుపై టెక్కలి సాయితేజ-11 జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సాయితేజ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు భారీ స్కోరు సాధించింది సాయితేజ-11 క్రీడాకారుడు ఉపేంద్ర అర్ధశతకాన్ని నమోదు చేశాడు. 122 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నౌపడ ఆర్ఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లను కోల్పోయి 87 పరుగులు మాత్రమే చేయగలిగింది ఈ పోటీలకు అంపైర్లుగా పవన్, శశిభూషణ్, మనోజ్, మోహన్, సూర్య వ్యవహరించారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు కళాభారతి పురస్కారం

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నం కళాభారతి 19వ రాష్ట్రస్థాయి సాంఘిక నాటికల పోటీలు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉత్తమ సంగీత కళాకారునికి వ్యక్తి గత బహుమతి సౌజన్యమూర్తిగా గుర్తించి కళాభారతి ఆడిటోరియంలో పలాసకు చెందిన కళాకారుడు, రచయిత డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి కళాభారతి పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి ట్రస్టు సుసర్ల రాంగోపాల్, పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, కళాభారతి ట్రస్టు కార్యదర్శి బి.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం


కవిటి : ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- కవిటి

మరోసారి ఆదర్శిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, మరిన్ని సంక్షేమ పథకాలు జగన్ అమలు చేస్తారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండలంలోని కరాపాడు పంచాయతీలో వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్ ఎం.లచ్చయ్య, నాయకులు బెందాళం జయప్రకాష్, పాండవ చంద్రశేఖర్, జల్లు యుగంధర్, ఝాన్సీ, మురళి, రవి, పి.కృష్ణారావు, కాయ భీమసేన్, ఎం.సంతోష్ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహసింగిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మద్దతుగా ఆమె కుమారుడు ఓంశ్రీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ సాధుబాబు, ఎన్.బాలకృష్ణ, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, అశోక్, బి.శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం ఎచ్చెర్ల శ్రీరామ మందిరంలో సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కళ్యాణోత్సవంలో జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎస్‌పి దంపతుల చేతులమీదుగా ఆలయ అర్చకులు సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. అనంతరం ఎచ్చెర్ల పోలీసు కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌పి దంపతలు ప్రారంభించి తీర్థ ప్రసాదాలు వడ్డన చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమా మహేశ్వరరావు, డిఎస్‌పిలు వై.శృతి, ఎల్.శేషాద్రి నాయడు, విజయ కుమార్, శ్రీనివాసరావు, ఆర్ఐలు, సిఐ, ఎస్ఐలు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్‌పి దంపతులు

రణస్థలం: మండలంలో అన్ని గ్రామాల్లో బుధవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి ముందుగా లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పాటించి శాస్త్రోక్తకంగా సాంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడతా...

ప్రజాశక్తి- బూర్జ

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ప్రజల పక్షాన నిలబడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి లోలుగు వెంకట రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కొలివలసలో విలేకరులతో మాట్లాడారు. 10 ఏళ్లుగా నియోజకవర్గంలో ప్రతిపక్షం లేకుండా ఉందన్నారు. ఎన్నికల వరకే పోటీపడి గెలిచిన తర్వాత ఒకటిగా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. అన్ని విధాలుగా అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వెంకట రాజశేఖర్

ఈ నెల 18న మధ్యాహ్నం 12 గంటలకు ఆముదాలవలసలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని వెంకట రాజశేఖర్ తెలిపారు.

టిడిపితోనే సంక్షేమ పథకాలు


సూపర్ సిక్స్ పోస్టర్లను గీత ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న మహిళలు

ఆమదాలవలస: తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలోని వెంకయ్యపేటలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తెలుగుదేశం పార్టీతోనే ప్రారంభమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సంపదరావు మురళి, బోయిన సునీత, బొడ్డేపల్లి లక్ష్మణరావు, గుడ్ల దుర్గాప్రసాద్, నాగళ్ల మురళీధర్ పాల్గొన్నారు.


పలాస : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

పలుచోట్ల అన్నదానం

పలాస : కాశీబుగ్గ రామాలయం వద్ద శ్రీరామ నవమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని మొండిరావివలస, కోటిపల్లి, తెంబూరు గ్రామాల్లో శ్రీరామ నవమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని నువ్వలరేవు, పల్లిసారథి, డోకులపాడు, పాతటెక్కలి, అమలపాడు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : మండలంలోని టి.బరంపురం సీతారామ రాలయం ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం సీతారామ ఉత్సవాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సభ్యులు, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, సుర్జిని, ఆంపురం, గొప్పిలి, చాపర, కోసమాల గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

మరో ఛాన్స్ ఇచ్చి ఆశీర్వదించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మరో ఛాన్స్ ఇచ్చి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని నెల్లిపర్తిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించే వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకు వెళ్లాలన్నా, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతిఒక్కరు మద్దతు పలకాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మానుకొండ రాజేశ్వరి, పిఎసిఎస్ డైరెక్టర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ఓటును అభ్యర్థిస్తున్న సీతారాం

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

గ్రంథాలయాల సంఘం ఉత్తరాంధ్ర సమన్వయకర్త గోవిందరావు

నౌపడ : విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని ఏపి గ్రంథాలయాల సంఘం ఉత్తరాంధ్ర సమన్వయకర్త, కోటబొమ్మాళి జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఎం.సున్నాపల్లిలో రూ.6.50 లక్షల వ్యయంతో బైపల్లి వెంకటస్వామి స్మారకార్థం వారి కుమారులు, గ్రామస్తులు సౌజన్యంతో నిర్మించిన బైపల్లి వెంకటస్వామి స్మారక గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గోవిందరావు

మాట్లాడుతూ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, సామాన్యులకు అవసరమైన పుస్తకాలు, సమాచార పత్రికలు, గ్రంథాలు నిక్షిప్తమై ఉన్న ఈ గ్రంథాలయాన్ని గ్రామస్తులు వినియోగించుకుని గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. గ్రామానికి చెందిన వ్యక్తులు వృత్తి రీత్యా వేరే ప్రాంతాల్లో ఉన్నా, వారి ఫోన్ నంబరు, సమాచారం ఈ గ్రంథాలయంలో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. దీనిద్వారా ఈ గ్రామస్తులకు తమ పిల్లల సమాచారం గ్రంథాలయంలో లభిస్తుందన్న నమ్మకం కలిగేలా కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 70 గ్రంథాలయాలను ఆయా ప్రాంతాల ప్రజల ద్వారా ఏర్పాటు చేశామనితెలిపారు. ఈ సందర్భంగా సమన్వయకర్త గోవిందరావును, ఉపాధ్యాయులు ఎస్.సంజీవరావు, జి.పాపారావు, ఎం.వెంకటరావు, రాజ్ కుమార్‌లను అలాగే గ్రామ పెద్దలు ఎ.తిరుపతిరావు, చక్క సింహాచలంలు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బైపల్లి మోహనరావు, పెళ్లెయిదండ నరసింహులు, ఎర్రన్న పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న రమణమూర్తి

రమణమూర్తి ప్రచారం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని గోపాలపెంట పంచాయతీ గోపాలపెంట, గదిలివానిపేట గ్రామాల్లోఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఎన్నిల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టిడిపి అధికారంలో వస్తే నియోజకరవ్గ అభ్యర్థికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

'జ్ఞానభారతి' విద్యార్థులకు ప్లేస్‌మెంట్

ఇచ్ఛాపురం: స్థానిక జ్ఞానభారతి సీనియర్ సెకండరీ విద్యా సంస్థలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎచ్‌సిఎల్ కంపెనీలో ప్లేస్‌మెంట్ ప్రక్రియ ప్రారంభమైదని కార్యదర్శి జోహర్ ఖాన్ బుధవారం తెలిపారు. మార్చిలో పాఠశాలలో సిబిఎస్ఇ ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులను తమ సంస్థలో ఐటి ఉద్యోగులుగా నియమించుకునేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ట్రిబుల్ ఐటి చదువుకునేందుకు అవకాశాన్నీ హెచ్‌సిఎల్ కల్పించిందన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని విద్యార్థులను ప్రాథమికంగా తమ కంపెనీలో ఉద్యోగం ఇచ్చేందుకు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. హెచ్‌సిఎల్ కంపెనీలో పూర్తిస్థాయి ప్లేస్‌మెంట్ కోసం మే రెండో వారంలో కాట్-1 పరీక్షలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో క్యాట్-1 పరీక్షలు సన్నద్ధం చేసేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని అన్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సంబంధిత సబ్జెక్టు నిపుణులచే శిక్షణ ఇస్తున్నామని అన్నారు.


మరమ్మత్తులు చేస్తున్న సిబ్బంది

పైపులైనుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

తాగునీరు తృథా అంటూ మంగళవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం సాయంత్రం సంబంధిత సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పాడైన పైపులైనుకు మరమ్మత్తులు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వంశీ మాట్లాడుతూ సమాచార లోపం వల్ల పైపులైను మరమ్మత్తు చేయడంలో కొంత జాప్యం జరిగినట్టు తెలిపారు. ఇకపై ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.

జీడి, కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలి

పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు దానేష్

ప్రజాశక్తి- పలాస

జీడి, కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరించాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు లేక, ప్రకృతి సహకరించక జీడి, కొబ్బరి పంటలు పూర్తిగా దెబ్బ తిని పచ్చని పువ్వు రాలిపోతుందని అన్నారు. పచ్చదనంతో కళకళగా ఉండాల్సిన జీడి, కొబ్బరి పంట ఎడారిలో ఉన్న చెట్లు మాదిరిగా కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిత్లీ తుపాను వచ్చిన తర్వాత ఉద్దానం అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి, కొబ్బరి పంటలకు అప్పులు చేసి పురుగు మందులు, ఎరువులకు పెట్టిన పెట్టుబడులూ వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పాలకులను ప్రశ్నిస్తున్నా ఈ పరిస్థితి మారలేదని, ఇదే కొనసాగితే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతుల పక్షమే అన్న రాజకీయ పార్టీలపై ప్రజలకు విశ్వాసం


మాట్లాడుతున్న దానేష్

సన్నగిల్లక మానదని అన్నారు. ఎన్నికల హడావుడిలో ఉన్న రాజకీయ పార్టీలు ఆలోచించాలని కోరారు. ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే ఉద్దానం ప్రాంతాలను పర్యటించి ఒక నివేదిక తయారు చేసి రాష్ట్రస్థాయి వ్యవసాయక అధికారులకు నివేదించాలని కోరారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు, కార్యదర్శి పింది వెంకటరావు, సహాయక కార్యదర్శి సోమనాథం, జిల్లా కమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, దున్న కృష్ణారావు, లక్ష్మణ్, వైకుంఠరావు, ఢిల్లీరావు, జోగారావు పాల్గొన్నారు.

గోపికి 'సహస్ర చిమ్నీ శేఖర' పురస్కారం

ప్రజాశక్తి- కవిటి


గోపి

సమాజ హితం కోసం, నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలు, సంప్రదాయ విలువలు తెలిపే విధంగా వెయ్యి కవితలు రాసిన మండలంలోని ఉపాధ్యాయుడు మొర్రి గోపికి 'సహస్ర చిమ్నీ శేఖర' పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లాకు చెందిన శ్రీహంస వాహిని సాహిత్య కళా పీఠం ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చిమ్నీల రూపకర్త జాదవ్ పుండలిక్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చిమ్నీల న్యాయ నిర్ణేతలు జాగిరి యాదగిరి, బసవరాజు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అభినందించారు.

'ఇచ్ఛాపురం' బహుమతిగా ఇద్దాం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాయిరాజ్

కవిటి: ఈ ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిరియా విజయను గెలిపించి సిఎం జగన్‌కు బహుమతిగా ఇద్దామని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. కంచిలి మండలం జాడుపూడి పంచాయతీ జాడుపూడి కాలనీలోని బేడబుడ్డగ, పూసల, రజిక తరగతికి చెందిన వైకుంఠరావు, మర్రిపూడి భైరాగి, గంట మల్లేష్, గంట వేమరాజు, మిర్యాల వెంకటరావు, రమణమూర్తి, బోయశెట్టిదేవి, బోయశెట్టి పురుషోత్తం, బోయశెట్టి సన్యాసి, బోయశెట్టి సాయితో పాటు 500 కుటుంబాలు బుధవారం వైసిపిలో చేరాయి. మండలంలోని బల్లిపుట్టుగలో జరిగిన ఈ కార్యక్రమంలో సాయిరాజ్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీలో చేరినవారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచిలి ఎంపిపి పైలా దేవదాస్‌రెడ్డి, జాడుపూడి సర్పంచ్ ప్రతినిధి పలికిల జయరాం, నుకయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

సమిష్టిగా కృషి చేయాలి

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో వైసిపి నాయకులు సమిష్టిగా కృషి చేసి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ గెలుపునకు కృషి చేయాలని పరిశీలకులు చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక టౌన్ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ అధ్యక్షతన కన్వీనర్లతో, గృహ సారథులతో నాయకులతో నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, సీడాప్ చైర్మన్ శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రకుమార్ పాల్గొన్నారు.


పార్టీ కండువా వేస్తున్న దువ్వాడ శ్రీనివాస్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గం నందిగాం మండలం పెద్దతామరపల్లికి చెందిన పలువురు టిడిపి నాయకులు వైసిపిలోకి బుధవారం చేరారు. వీరికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సిఎం జగన్ ప్రవేశిపెట్టిన నవరత్నాలు పథకాలను ఆకర్షితులై వైసిపిలో చేరామని తమిరి ఫాల్గునరావు, పోలాకి ఫాల్గుణరావు, పోలాకి మురళి, బూరి సీతారాం, తెంబూరు అప్పారావు, తెంబూరు సోమేశ్వరరావు తెలిపారు. వీరితో పాలు 50 కుటుంబాలు చేరాయి.

16 మంది వాలంటీర్ల రాజీనామా

టెక్కలి రూరల్ : మండలంలోని చాకిపల్లికొత్తూరు సచివాలయ పరిధిలో బుధవారం 16 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. చాకిపల్లి, కొణుసులుకొత్తూరు, గ్రామ సర్పంచ్‌లు వాన తవిటయ్య, మొర్రి శంకరరావు, ఎంపిటిసి ప్రతినిధి పొందరు శ్రీనివాస్, వైసిపి నాయకులు బోర్ల భాస్కరరావు, సచివాలయం కన్వీనర్ బొంగు భైరాగిరెడ్డిల ఆద్వర్యాన ఎంపిడిఒకు రాజీనామా పత్రాలను అందజేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పెద్దమురహరిపురంలో యువతరం సేవాసమితి ఆధ్వర్యాన ప్రాణదాత బ్లడ్ బ్యాంకు పలాస సౌజన్యంతో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం యువతరం సేవా సమితి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రతి దాతకూ ఏడాది పాటు బీమా సౌకర్యం సంస్థ కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, పి.ఎం.పురం


రక్తదానం చేస్తున్న యువకులు

సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గోరకల సునీల్, ఇన్‌ఛార్జీలు బత్తిని విగ్నేష్, లక్ష్మణ్, బి.గణేష్, బి.లక్ష్మణ్, నవతరం సేవా సమితి అధ్యక్షులు రవి తేజ, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఫౌండర్ కీలు విజయ్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రాసద్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి లైన్ మైంటేనెన్స్ పనులు, చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, బొరివంక, బి.జి.పుట్టుగ, ఇద్దివానిపాలెం, దూగానపుట్టుగ, వరక పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, ఆర్‌డబ్ల్యూఎస్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



సుధాకర్‌ను అభినందిస్తున్న వాకర్స్

నడక పోటీ విజేతకు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హైదరాబాద్‌లోని రైల్వే క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13న నిర్వహించిన జాతీయస్థాయి నడక పోటీల్లో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జిల్లా నివాసి నళినీ సుధాకర్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సుధాకర్ నడక పోటీల్లో అనేక అవార్డులు సాధించారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, జి.ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.వి.రవిశంకర్, దేవీప్రసాద్, ఎస్.సంజీవరావు, రత్నాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోతులను పూడ్చుతున్న యువత

చేయి చేయి కలిపారు.. గోతులు పూడ్చారు

ప్రజాశక్తి- బూర్జ

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువత తలుచుకుంటే అసాధ్యం అనేది ఏమీ లేదని నిరూపించారు. మండలంలోని నీలంపేట గ్రామ సమీపంలో ఏర్పడిన పెద్ద గోతులు కారణంగా ద్విచక్ర వాహనాలు బోల్తా పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. గత నెల బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు సందర్భంగా విధులు ముగించుకొని కొల్లివలస వస్తుండగా సురేష్ అనే కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు ఇదే గోతులో పడి మృతి చెందాడు. అలాగే మంగళవారం రెండు బైకులు ఇదే గోతిలో పడి ఇద్దరు మహిళలు తీవ్ర గాయాలకు గురయ్యారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలను నివారించేందుకు తమవంతుగా రాజుపేట గ్రామ యువత చేయిచేయి కలిపి బుధవారం ఆ గోతులను పూడ్చారు. ఆర్అండ్‌బి, పోలీస్ శాఖ, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా పట్టించుకోకపోయినప్పటికీ యువత మానవతా దృక్పథంతో శ్రమదానం చేయడంతో మండల ప్రజలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి సుధాకరరావుతో పాటు మణికంఠ, సాయికుమార్, ఎం.సాయికుమార్, దుర్గాప్రసాద్, యశ్వంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్సీకి జైలుశిక్షపై హర్షం

ప్రజాశక్తి- రణస్థలం

శిరోమండనం కేసులో వైసిపి ఎమ్మెల్సీకి జైలు శిక్ష పడిందని, ఈ తీర్పు పట్ల జిల్లా దళిత మహాసభ అధ్యక్షులు బోకర నారాయణరావు, ప్రధాన కార్యదర్శి దేబారికి రాము, ఉపాధ్యక్షులు డి.కుసుమ, మహిళా కార్యదర్శి సుభద్ర తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో 1996 డిసెంబర్ 29న అప్పటి టిడిపి ఎమ్మెల్యే, ప్రస్తుత వైసిపి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఐదుగురు దళితులను చిత్రహింసలకు గురిచేసి అందులో ఇద్దరికి శిరోమండనం చేసిన కేసులో 28 ఏళ్ల తర్వాత విశాఖపట్నం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కోర్టు తోట త్రిమూర్తులు, మరో 9 మందికి 18 నెలల జైలుశిక్ష, రూ.2 లక్షల 50 వేలు జరీమానా విధిస్తూ తీర్పు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా దళిత వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

నెరవేరని డిగ్రీ కళాశాల కల

- ఎన్నికల వేళ హామీలకే పరిమితం
- ముఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎన్నికల సమయంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తాం, ప్రజలకు అవసరమైన పనులు చేపడుతాం అని వూక దంపుడు వాగ్దానాలను చేయడం. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను మర్చిపోవడం పరిపాటిగా మారింది. దీంతో ఆయా గ్రామస్తులకు 'కల' నెరవేరని కలగానే మిగులుతుంది.

ప్రజాశక్తి- బూర్జ

ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి తాము అధికారంలోకి రాగానే గ్రామాలకు, మండలాలకు అవసరమైన ఎన్నో పనులను చేపడతామని హామీలు గుప్పిస్తున్నారు తప్ప ఆచరణలో శూన్యముగా కనిపిస్తుంది. బూర్జ మండల కేంద్రంలో రెండు దశాబ్దాల కాలంగా ప్రజల డిగ్రీ కళాశాల కల కలగానే మిగిలింది. రెండు దశాబ్ధాల క్రితం అప్పుటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి బూర్జ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా డిగ్రీ కళాశాలకు అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించారు. అయితే రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా పదవి చేపట్టినప్పటికీ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయలేకపోవడం శోచనీయం. అనంతరం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆముదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యేగా పదవి చేపట్టిన కూన రవికుమార్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అన్ని విధాలుగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈసారి కూడా మండల



గతంలో డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన స్థలం

ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ప్రకటన గుర్తించడం తప్పా ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో మండల ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఎన్నికలవేళ ఇచ్చిన హామీలు పదవులు చేపట్టిన తరువాత వాటిని అమలు చేసిన పరిస్థితులు కనిపించడం లేదని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అలాగే మండలంలోని ఉప్పినివలసలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం హామీలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. మండలంలోని పెద్దపేటలో పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని రెండు దశాబ్దాలుగా అధికారం చేపట్టిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు వాపోతున్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం, అధికారం చేజిక్కించుకోవడం కోసమే పెద్దపెద్ద హామీలను ఇస్తున్నారు తప్ప వాటిని అమలు చేసేందుకు ఎవరు శ్రద్ధ చూపడం లేదని వాపోయారు. దీనివలన తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా మండలానికి అవసరమైన డిగ్రీ కళాశాలను, పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు తప్పడం లేదు



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో తమకు అవస్థలు తప్పడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆముదాలవలస లేదా పాలకొండ పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో అనునిత్యం తీవ్ర అవస్థలు ఎదుర్కొం టున్నాం. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- సంతోషి పండా, విద్యార్థి, మామిడివలస

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే తమకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. డిగ్రీ కళాశాల లేకపో వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజా ప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, అలాగే పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలి.

- తొత్తడి మల్లేశ్వరరావు, చీడివలస

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- బూర్జ, పొందూరు, ఆమదాలవలస

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం మండలంలోని అయ్యవారిపేట గ్రామ సర్పంచ్ ఇప్పిలి అంబుజాక్షి, సర్పంచి ప్రతినిధి ఇప్పిలి సిమ్మన్న, కొత్తకోట శ్రీనివాసరావు, పిసిని స్వరూప నాయుడు, వార్డు మెంబర్ మామిడి వెంకటరావు, పతివాడ రామకృష్ణ తదితరులు ఆమదాలవలస టిడిపి కార్యాలయంలో కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిమ్మన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సాగించిన అరాచకాలను భరించలేక టిడిపిలో చేరామని తెలిపారు.

పొందూరు పంచాయతీ జోగన్నపేట నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో 50 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు.మండలపార్టీ అధ్యక్షులు రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.చినరంగ, చందక ఆది, శ్రీరంగనాయకులు, శంకరభాస్కర్, వి.మురళి, బాడాన గిరి, ఎంపిటిసిలు బి.హారిక, ఎ.వాణి, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, మాజీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పొందూరు : టిడిపిలో చేరిన వారితో రవికుమార్

మండలంలోని వెదుళ్లవలసకు చెందిన వైసిపి నాయకుడు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) కొర్లకోటలో రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఆయన అనుచరులు మరో 63 కుటుంబాలు టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ రవికుమార్ కండు వాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని బెలమాంకు చెందిన మాజీ సర్పంచ్ సేపాన వెంకటరమణ, పురపాలక సంఘంలోని 23వ వార్డు లక్ష్మదుపేటలో మాజీ కౌన్సిలర్ గురుగుబెల్లి నాగేశ్వర రావు, కూన ఆంజనేయులు ఆధ్వర్యంలో 30 కుటుంబా లు టిడిపిలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహనరావు, ఢిల్లేశ్వరరావు, సుజాత, కొత్తకోట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

రణస్థలం రూరల్: రణస్థలం 33/11కెవి సబ్‌స్టేషన్‌లో లైన్లు మరమతులు, చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా ఈనెల 19న 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సబ్ స్టేసన్ పరిధిలో జె.ఆర్.పురం, రణస్టలం, రావాడ, కొండములగాం, బంటుపల్లి, సంచాం, కమ్మసిగడం, అర్జునవలస పంచా యతీల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయ బడునని ప్రజలు సహరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు.

ఆమదాలవలస : 33/11 కె.వి పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలో వెంకయ్య పేట, అక్కులపేట (మునగవలస) ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఈ నెల 19న విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ బయ్యన్నాయుడు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని జగ్గు శాస్త్రులపేట, ఎపి టిడ్కో, చంద్ర హర్ష ఆక్వా, కెజిబివి స్కూల్, ఆర్ఆర్ గ్రానైట్, మండల పరిధిలో మండాది, మండాది బ్రిక్స్ ఫ్యాక్టరీ, అక్కులపేట, సంత కొత్తవలస, చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, కట్యాచార్యులపేట, ధన్నానపేట, సైలాడ, కుమ్మరిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

వెంటాడుతున్న తాగునీటి సమస్య



లక్ష్మదుపేట పంచాయతీలో నేలపై పడి ఉన్న కుళాయి పైపు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతుంది. ప్రధానంగా డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగట్లపాలెం పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉంది. ఇక్కడ భూగర్భ జలాలు ఉప్పునీరు కావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపడటం లేదు. మరోపక్క హస్తంపురం, లక్ష్మదుపేట, షేర్ మహమ్మద్ పురం, అరుణమెక్కివలస, చిలకపాలెం ప్రాంతాల్లో సైతం తాగునీటి సమస్య ఉంది. సింగూరు సమీకృత మంచినీటి పథకం నుంచి నీటి సరఫరా ఉదయం కొన్ని గంటలు మాత్రమే సరఫరా



డి.మత్స్యలేశంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

చేయగలుగుతున్నారు. మరోపక్క సుజలదార పథకం ద్వారా కొన్ని గ్రామాలకు మాత్రమే పైప్‌లైన్ వేశారు. కుళాయిలు సక్రమంగా లేకపోవడం, పైప్‌లైన్ లీకేజ్ సమస్యలు కూడా తాగునీటికి కారణమవుతున్నాయి. చాలా గ్రామాల్లో చేతిపంపుల మీద ప్రజలు తాగునీటికి ఆధారపడుతున్నారు. మరికొన్ని పంచాయతీల్లో చేతిపంపులు మరమ్మతులైతే తక్షణం మరమ్మతులు చేయలేకపోతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

30 కుటుంబాలకు ఒకే కుళాయి



తమ గ్రామంలో ఎప్పటికప్పుడు మంచినీటి సమస్య తలెత్తుతుంది. పైపులు మర మ్మతులకు గురవ్వడంతో నీళ్లులేక పలు బోర్లు వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. గతంలో కూడా ఇదే సమస్య తలెత్తింది. సుమారు 20 నుంచి 30 కుటుంబాలు ఒకే కొళా యిపై నీటి కోసం ఆధార పడుతున్నాం.

- రేళ్ల సూరీడమ్మ, షేర్ మహమ్మద్‌పురం

నీటి సమస్య ఎక్కువగా ఉంది



తమ గ్రామంలో వాటర్ ట్యాంకులు మరమ్మతులకు గురవ్వడంతో మంచినీటి సమస్య అధికమైంది. ఇక్కడ ప్రధానంగా ఉప్పునీరు సమస్య ఉండటంతో తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నాం. పైపులైన్లు వేసి అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో నీటికోసం అవస్థలు పడుతున్నాం.

- కారి గడ్డెమ్మ, డి.మత్స్యలేశం